జిట్టా బాలకృష్ణారెడ్డికి నివాళి


షాపూర్‌నగర్, సెప్టెంబర్ 6(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమ నాయకుడు జిట్టా బాలకృష్ణారెడ్డి మృతి ఉద్యమకారులకు తీరనిలోటని కుత్బుల్లాపూర్ తెలంగాణ ఉద్యమకారుల వేదిక అధ్యక్షుడు ఎం. అశోక్‌రెడ్డి అన్నారు. బాలకృష్ణారెడ్డి చిత్రపటం వద్ద ఉద్యమ నాయకులు నివాళులర్పించారు.













కమ్యూనిటీ హాల్ స్థలం కబ్జాకు యత్నం..

అడ్డుకున్న ఎమ్మెల్యే గాంధీ

హైదర్‌నగర్, సెప్టెంబర్6 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి నియోజకవర్గం ఆల్విన్ కాలనీ డివిజన్ జయనగర్ కాలనీలోని కమ్యూనిటీహాల్ స్థలాన్ని కొందరు ప్రైవేటు వ్యక్తులు శుక్రవారం కబ్జా చేసేందుకు ప్రయత్నించగా పెద్దఎత్తున కాలనీ వాసులు వెళ్లి అడ్డుకున్నారు. అడ్డుకునేందుకు వచ్చిన మహిళలను సదరు వ్యక్తులు వీడియోలు, ఫొటోలు తీస్తూ వారిని వెళ్లిపోవాలని బెదిరింపులకు దిగారు. దీంతో స్థానికులు ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కూకట్‌పల్లి పోలీసులకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. వెంటనే ఎమ్మెల్యే కాలనీకి చేరుకుని ప్రైవేటు వ్యక్తులను అడ్డుకుని ఐరన్ ఫెన్సింగ్ పనులు నిలిపివేయించి వారిని అక్కడి నుంచి పంపివేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ, 30ఏళ్ల క్రితం



కబ్జా చేసేందుకు వచ్చిన వారితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, స్థానికులు

జయనగర్ కాలనీ లేఔట్‌లో ఈ స్థలాన్ని పార్కు కోసం కేటాయించారని, ఇప్పుడు ఇదే స్థలంలో కాలనీ వాసులు కొన్నేళ్ల నుంచి వినాయక చవితి వేడుకలు జరుపుకుంటున్నారని తెలిపారు. ఇటీవల కొందరు ప్రైవేటు వ్యక్తులు నకిలీ పత్రాలు సృష్టించి స్థలం తమదంటూ కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారన్నారు. ఈ స్థలం గురించి 2010 నుంచి పలుమార్లు ఆర్టీఏ ద్వారా హెచ్ఎండీఏకు దరఖాస్తు చేస్తే ఇక్కడ కాలనీకి సంబంధించిన పార్కు స్థలం ఉందని అధికారులు బదులిచ్చారన్నారు. ఇలాంటి వారిపై ఇప్పటికే కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని, ఎన్నో ఏళ్లుగా ఈ స్థలాన్ని కాలనీ వాసులు ఉపయోగిస్తుంటే ఇప్పుడు హైకోర్టు ఆర్డర్ పేరుతో కబ్జా చేసేందుకు యత్నిస్తున్న వారిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరారు. అయితే.. తమ స్థలానికి ఫెన్సింగ్ వేస్తుంటే స్థానికులు అడ్డుకున్నారని తమకు కోర్టు ఆర్డర్ సైతం ఉందని తమకు న్యాయం చేయాలని చంద్రశేఖర్ అనే వ్యక్తి కూకట్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

కట్టమైసమ్మ చెరువును సందర్శించిన సీపీ

గాజులరామారం, సెప్టెంబర్ 6(ఆంధ్రజ్యోతి): సూరారం కట్టమైసమ్మ, లింగం చెరువులో జరిగే వినాయక నిమజ్జనం ఏర్పాట్లను సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి పలు శాఖల అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన నిమజ్జనం సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు పలు సూచనలు చేశారు. సీపీ వెంట మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి, మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి, బాలానగర్ ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, సూరారం సీఐ భరత్‌కుమార్, ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్‌తో పాటు జీహెచ్ఎంసీ అధికారులు ఉన్నారు.



మియాపూర్‌లో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్న జగదీశ్వర్‌గౌడ్, ఇన్‌స్పెక్టర్ దుర్గారామలింగ ప్రసాద్, మన్నేపల్లి సాంబశివరావు

మియాపూర్‌లో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ

మియాపూర్, సెప్టెంబర్6(ఆంధ్రజ్యోతి): మియాపూర్ ఆర్‌బీఆర్ కాంప్లెక్స్ వద్ద శుక్రవారం కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మన్నేపల్లి సాంబశివరావు ఆధ్వర్యంలో మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. ఇన్‌స్పెక్టర్ దుర్గారామలింగ ప్రసాద్, శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్ గౌడ్ హాజరై విగ్రహాలను భక్తులకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పాపిరెడ్డి, శ్రీనివాస్‌ముదిరాజ్, సత్యారెడ్డి, రవి, ప్రియదర్శిని, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

వినాయక విగ్రహాలను పంపిణీ చేసిన ఎమ్మెల్యే

హైదర్‌నగర్, సెప్టెంబర్6(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు మట్టిగణపతులను పూజించాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, వెంకట్రావ్‌నగర్ కమ్యూనిటీహాల్‌లో మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు.



కార్యక్రమంలో కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

రోడ్లకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలి

● ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

పేట్‌బషీరాబాద్, సెప్టెంబర్ 6(ఆంధ్రజ్యోతి): వర్షాలకు దెబ్బతిన్న రోడ్లకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జీడిమెట్ల డివిజన్‌లోని పేట్‌బషీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జీహెచ్ఎంసీ కుత్బుల్లాపూర్ సర్కిల్ ఇంజనీరింగ్ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలకు కుత్బుల్లాపూర్, గాజులరామారం జంటసర్కిళ్ల పరిధిలోని డివిజన్ రహదారులు దెబ్బతిన్నాయని, వాటికి సత్వరమే మరమ్మతులు చేపట్టాలన్నారు. జీడిమెట్ల డివిజన్ వెన్నెలగడ్డలోని బస్తీదవాఖానాలో నెలకొన్న సమస్యలపై ఆ ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఈఈ లక్ష్మీగణేష్, డీఈ పాపమ్మ, ఏఈఈ మల్లారెడ్డి, అనురాగ్, వైద్యులు స్వర్ణలత, మాధవి, విజయలత, అమృత, స్వప్న పాల్గొన్నారు.

రోడ్డు స్థలం ఆక్రమణపై కాంగ్రెస్ ఫిర్యాదు

పేట్‌బషీరాబాద్, సెప్టెంబర్ 6(ఆంధ్రజ్యోతి): కొంపల్లి మున్సిపాల్టీలోని సర్వే నంబర్ 199లో సుమారు 847 గజాల స్థలాన్ని కొంతమంది వ్యక్తులు ఆక్రమించి ప్లాట్లుగా విక్రయించారని కాంగ్రెస్ పార్టీ నాయకులు కొంపెల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీహరికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు తాము కోర్టులో అప్పీలు చేసిన ఆధారాలు, పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కొపంల్లి కౌన్సిలర్ శ్రీవిద్య ప్రశాంత్‌గౌడ్, మాజీ సర్పంచ్ జిమ్మిదేవేందర్, మాజీ వార్డు సభ్యుడు సన్నా శ్రీనివాస్ మాట్లాడుతూ, కొంపెల్లి మున్సిపల్‌లోని గండిమైసమ్మ, దుండిగల్ మండల సరిహద్దులోని సర్వేనంబర్ 199లో 18. 91గుంటల రోడ్డు భూమి గ్రామపంచాయతీ ఆధీనంలో ఉండగా, అందులో నాలుగు ఎకరాల స్థలాన్ని హెచ్ఎండీఏ ద్వారా ఎంఎస్ఈ-3 ఇన్‌ఫ్రా బిల్డింగ్ ఇండియా ప్రవేట్ లిమిటెడ్ వారు 69విల్లాలకు అనుమతులు పొందారన్నారు. ఆ విల్లాలకు సరియైన రోడ్డుమార్గం చూపించేందుకు 2016లో 40 అడుగుల రోడ్డుకు కోసం అప్పట్లో గ్రామపంచాయతీకి గిఫ్ట్ డీడ్ చేసి ఇచ్చారన్నారు. సంస్థ నిర్వాహకులు 2020 జూన్‌లో మున్సిపాల్టీకి సమాచారం ఇవ్వకుండానే రోడ్డు స్థలాన్ని తమ పేరిట మార్పు చేసుకున్నారన్నారు. కాలక్రమేణా దూలపల్లి ప్రాంతానికి చెందిన బి. సత్యనారాయణ, ఇతరులు రోడ్డును మాయం చేసి ప్రస్తుతం ప్లాట్లుగా మార్చి అక్రమంగా విక్రయించారని కమిషనర్ శ్రీహరి దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయంపై కమిషనర్‌ను వివరణ కోరగా, ఆక్రమణకు గురియైన రోడ్డు స్థలాన్ని సందర్శించి, దానిని స్వాధీనం చేసుకుంటామన్నారు.

అధికారులు, సిబ్బంది బీఆర్ఎస్ కార్యకర్తల్లా పనిచేస్తున్నారు: కూన

కుత్బుల్లాపూర్, సెప్టెంబర్6(ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్, గాజులరామారం జీహెచ్ఎంసీ జంట సర్కిళ్ల కార్యాలయాలను కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ శుక్రవారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉదయం 11 గంటలకు కూడా ఏ ఒక్క అధికారి, సిబ్బంది ఆఫీసులో లేకపోవడంతో ఆయన అసహనానికి గురయ్యారు. మాజీ ఎమ్మెల్యే వచ్చారని తెలుసుకున్న గాజులరామారం డీసీ మల్లారెడ్డి కార్యాలయానికి రాగా ఆయనపై మండి పడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 18 గంటల కష్టపడి ప్రజలకు సేవలందిస్తుంటే, కుత్బుల్లాపూర్, గాజులరామారం సర్కిళ్లలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది 9 ఏళ్లుగా ఇక్కడే పాతుకుపోయి బీఆర్ఎస్ కార్యకర్తలు లాగా పనిచేస్తున్నారని కూన ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీని అప్రతిష్టపాల్జేయడానికి కంకణం కట్టుకున్నట్టుగా కనిపిస్తున్నదని అన్నారు. వివిధ సమస్యలపై వస్తున్న ప్రజలకు కనీసం సమాధానం చెప్పేవాళ్లు లేరన్నారు. జీహెచ్ఎంసీ కమిషనర్, స్థానిక మంత్రి దృష్టికి తీసుకెళ్లి ఇక్కడ పాతుకుపోయిన అధికారులు, సిబ్బందిని బదిలీ చేయాలని కోరతానని అన్నారు. జిమ్మిదేవేందర్, కార్పొరేటర్ ఏనుగుల శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్ భైరి ప్రశాంత్‌గౌడ్ పాల్గొన్నారు.

భవనంపై నుంచి దూకి సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని ఆత్మహత్య

దుండిగల్, సెప్టెంబర్ 6(ఆంధ్రజ్యోతి): తండ్రితో గొడవపడిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని భవనంపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకొంది. దుండిగల్ పోలీసుల కథనం ప్రకారం... సర్వే నంబర్ 168 ప్రాంతంలోని శ్లోకా పాఠశాల ప్రాంతంలోని ఓ అపార్టుమెంట్‌లో సాయిమీనా(22) నివాసం ఉంటూ ఉద్యోగ ప్రయత్నం చేయగా, గుంటూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వచ్చింది. గుంటూరులో ఉద్యోగం చేయడం సాయిమీనాకు ఇష్టం లేదు. తండ్రి నర్సింహసాగర్ అక్కడికి వెళ్లి ఉద్యోగం చేయాలన్నాడు. దీంతో తండ్రితో గొడవపడిన మీనా శుక్రవారం తాము ఉంటున్న భవనం మూడవ అంతస్తునుంచి దూకి ఆత్మహత్య చేసుకొంది. ఇరుగుపొరుగువారు ఆమెను సూరారం మల్లారెడ్డి ఆసుపత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే మీనా చనిపోయిందని నిర్ధారించారు. కేసు దర్యాప్తులో ఉంది.

మేజర్ అయ్యాక పెళ్లి చేస్తామన్నారని..

ఉరి వేసుకుని బాలిక ఆత్మహత్య

మియాపూర్, సెప్టెంబర్6(ఆంధ్రజ్యోతి): తాను ప్రేమించిన అబ్బాయినే పెళ్లి చేసుకుంటానని ఓ బాలిక తల్లిదండ్రులకు గట్టిగా చెప్పగా వారు నువ్వు ఇప్పుడు మైనర్‌వి, మేజర్ అయిన తర్వాత పెళ్లి చేస్తామని చెప్పారు. దీంతో మనస్థాపం చెందిన బాలిక ఇంట్లో ఎవరు లేని సమయంలో చీరతో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ ఘటన జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తూర్పుగోదావరి జిల్లా, పెనుగొండ మండలానికి చెందిన సుబ్బారావు కుటుంబంతో కలిసి నగరానికి వచ్చి హెచ్ఎంటీ స్వర్ణపురికాలనీలో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. వీరికి కొడుకు, కుమార్తె (మైనర్) ఉన్నారు. కాగా బాలిక తమ స్వగ్రామం పక్క ఊరికి చెందిన ఓ వ్యక్తిని ప్రేమించింది. ఆ విషయాన్ని రెండునెలల క్రితం కుటుంబ సభ్యులకు చెప్పింది. దీంతో నీకు ఇంకా 18 ఏళ్లు పూర్తికాలేదు, మేజర్ అయిన తర్వాత వివాహం చేస్తామని చెప్పారు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన బాలిక గురువారం ఇంట్లో ఎవరు లేని సమయంలో చీరతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మండపం వద్ద విద్యుత్ షాక్‌తో ఒకరి మృతి

మరొకరికి గాయాలు

పేట్‌బషీరాబాద్, సెప్టెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): వినాయక మండపం ఏర్పాటు చేస్తుండగా ఇద్దరి యువకులకు విద్యుత్ షాక్ తగిలి ఒకరు మృతి చెందగా మరొకరు గాయలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. దూలపల్లి గ్రామ నివాసి యు.నవీన్ చారి(28) స్థానిక పారిశ్రామిక వాడలో ఉన్న బస్ బాడీలో పనిచేస్తుంటాడు. దూలపల్లి రామాలయం వెనకాల శుక్రవారం సాయంత్రం గణేష్ మండపంపై వర్షం పడకుండా తాటిపత్రిని కప్పి వైరు బండల్ తో కట్టేందుకు ఒక చేయితో వైర్ ను పట్టుకొని మరో చేయితో వైర్ ను మండపం పైకి వేశాడు. దీంతో మండపం పై ఉన్న విద్యుత్ వైర్లకు ఈ వైరు తగలడంతో ప్రమాదవశాత్తు నవీన్ చారికి విద్యుత్ షాక్ తగలడంతో పక్కనే ఉన్న వర్షపు నీటిలో పడి అపస్మారక స్థితిలోకివెళ్లాడు. మండపం వద్ద ఉన్న వి.శంకర చారి కర్రతో నవీన్ చారిచేతిలో ఉన్న వైర్ ను కొట్టడంతో భూమి తడిగా ఉండడంతో అతని కూడా షాక్ రావడంతో గాయాలయ్యాయి. స్థానికులు ఇద్దరిని కొంపల్లిలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే నవీన్ చారి మృతి చెందాడని తెలిపారు. శంకరాచారి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

అభివృద్ధి పనులను తిరిగి ప్రారంభించండి: జీహెచ్ఎంసీ కమిషనర్

గచ్చిబౌలి, సెప్టెంబర్6(ఆంధ్రజ్యోతి): ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని జీహెచ్ఎంసీ అభివృద్ధి పనులు చేపడుతుందని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో చాలా కాలంగా అభివృద్ధి పనులు పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారి ప్రజల నుంచి వచ్చిన వినతులను దృష్టిలో ఉంచుకుని శుక్రవారం కమిషనర్ పర్యటించారు. చందానగర్ నుంచి అమీన్‌పూర్ వరకు రోడ్డు విస్తరణ చేసేందుకు గత ప్రభుత్వం పనులు ప్రారంభించి మధ్యలో నిలిపివేసింది. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని కమిషనర్ ఆమ్రపాలి, జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీతో కలిసి శ్రీదేవి థియేటర్ రోడ్డును చందానగర్ నుంచి అమీన్‌పూర్ వరకు పరిశీలించారు. అనంతరం గత కొన్నేళ్లుగా లింగంపల్లి అండర్ బ్రిడ్జి వద్ద వరదనీరు నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు పడటం పరిపాటిగా మారిందని తెలుసుకుని ఆమె పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను తిరిగి ప్రారంభించి పనులు వేగవంతం చేసి పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ముందుగా చందానగర్ నుండి అమీన్‌పూర్ వరకు 100 అడుగుల రోడ్డు, లింగంపల్లి రైల్వే బ్రిడ్జి వద్ద ప్రతియేటా వర్షాకాలంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. చందానగర్, శేరిలింగంపల్లి కార్పొరేటర్లు మంజులరెడ్డి, రాగం నాగేందర్‌యాదవ్, అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.











